సాక్షి
కామారెడ్డి
సోమవారం ¡ 7 ¡ అక్టోబర్ ¡ 2024



గడపగడపకు సంక్షేమం..

సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరుతున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.
- 8లో ▸



అత్తతో కలిసి మామ హత్య

ఆస్తి కోసం ఓ అల్లుడు అత్తతో కలిసి మామను హత్య చేశాడు. ఈ ఘటన బోధన్ పట్టణంలో చోటు చేసుకుంది.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /21.8

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఆజామాబాద్‌లో మద్య నిషేధం



ఎల్లారెడ్డి: ఆజామాబాద్‌లో మద్య నిషేధం విధించారు. గ్రామంలో మద్యం విక్రయించినవారికి, కొన్నవారికి రూ. 50 వేల జరిమానా విధించాలని గ్రామస్తులు తీర్మానం చేశారు. దీనికి అందరూ కట్టుబడి ఉండాలని తీర్మానించినట్లు గ్రామస్తులు తెలిపారు.

గడికోటను సందర్శించిన రిటైర్డ్ మేజర్ జనరల్



దోమకొండ: మండల కేంద్రంలోని గడికోటను ఆదివారం ఆర్మీ రిటైర్డ్ మేజర్ జనరల్ ఏవీకే మోహన్ సందర్శించారు. గడికోటలోని ఆనంద భవన్, క్లాక్ టవర్, అద్దాల భవనం, మహాదేవుని ఆలయాలను సందర్శించారు. గత చరిత్రకు గడికోట నిదర్శనంగా ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద యువకులకు ఆర్మీపై అవగాహన కల్పించారు. ఆర్మీలో చేరాలని యువకులకు సూచించారు. ఆయన వెంట లైఫ్ ఎన్జీవో ప్రతినిధి దేవరగట్టు బాలప్రసాద్ ఉన్నారు.

గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా చంద్రకాంత్‌రెడ్డి



భిక్కనూరు: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మద్ది చంద్రకాంత్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంకటేశం ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. చంద్రకాంత్‌రెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆయన రామేశ్వర్‌పల్లి ఎంపీటీసీగా, ఆయన భార్య శ్యామం రామేశ్వర్‌పల్లి సర్పంచ్‌గా పనిచేశారు. తనను గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించిన సీఎం రేవంత్‌రెడ్డి, తన నియామకానికి కృషి చేసిన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

నిజామాబాద్ చైర్మన్‌గా..



ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంతిరెడ్డి రాజిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని కోటగల్లీకి చెందిన రాజిరెడ్డి గతంలో పీఏసీఎస్ చైర్మన్‌గా పనిచేశారు. నుడా చైర్మన్‌గా నియమిస్తారని ఆశించారు. ఆయనను ప్రభుత్వం గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించింది.

నిజాంసాగర్‌లోకి 18,700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 18,700 క్యూసెక్కుల వరద వస్తోందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. దీంతో ప్రాజెక్టు 4 వరద గేట్ల ద్వారా 17 వేల క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నామన్నారు. ప్రధాన కాలువకు 1,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 1,404.83 అడుగుల(17.556 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

బీకేఎస్ రాష్ట్ర కార్యవర్గం

కామారెడ్డి అర్బన్: భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జోగినిపల్లి శ్రీరంగారావు మరోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా పన్యాల వెంకటరెడ్డి, గైని నగేశ్, ఉడుముల లావణ్య, మాదిరెడ్డి రాజిరెడ్డి(విద్యుత్ ప్రముఖ్), రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అంబీర్ ఆనందరావు, కోశాధికారిగా లింగన్నోళ్ల మాణిక్‌రెడ్డి(జలవిభాగ్ ప్రముఖ్), కార్యదర్శులుగా కొమిరెడ్డి అంజన్న, చేపూరి విజయ్ భాస్కర్, రవీందర్ రాజు, మల్లారెడ్డి, మహిళా ప్రముఖ్‌గా ఎల్.ప్రముఖ, ప్రత్యేక ఆహ్వానితులుగా సుబ్రహ్మణ్య రాజు(గోఆధారిత ఉపాధ్యక్షుడు), సంపత్ రావు, డబ్బారవి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా 13 మందిని ఎన్నుకున్నారు.

వంటింట్లో ధరల మంట!

- పండుగల వేళ నిత్యావసరాల ధరల మోత
- కూరగాయలదీ అదే దారి..
- ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ కొనలేని పరిస్థితి
- సామాన్యుడికి కష్టకాలం

నిత్యావసరాల ధరలు రోజురోజుకు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయలతోపాటు ఇతర సరుకుల ధరలన్నీ తగ్గేదేలే అన్నట్లుగా పోటీ పడుతూ పెరిగిపోతూనే ఉన్నాయి. అడ్డగోలుగా పెరిగిన ధరలతో పండుగలు చేసుకోవడం సామాన్యులకు భారంగా మారింది. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తెలంగాణలో పెద్ద పండుగలు, బతుకమ్మ, దసరా. ఈ పండుగలు వచ్చాయంటే ఎక్కడెక్కడో ఉన్నవారు సొంతూళ్లకు చేరుతుంటారు. పండుగ పేరుతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో సంతోషంగా గడపాలనుకుంటారు. అయితే ఈసారి పండుగల మీద ధరల ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. పప్పులు, నూనెలతో పాటు బియ్యం, కూరగాయలు ఆఖరుకు ఉల్లిగడ్డ, వెల్లుల్లి కూడా అడ్డగోలుగా పెరగడంతో సామాన్యుడికి పండగలు చేసుకోవడానికి భయపడే పరిస్థితి ఏర్పడింది. ధరల నియంత్రణ లేకపోవడంతో మార్కెట్‌లో అన్ని రకాల వస్తువుల ధరలు అడ్డగోలుగా పెరిగాయి. సన్నరకం బియ్యం పావు క్వింటాలుకు (25 కిలోలు) రూ.1,650 నడుస్తోంది. ఇంకా పాతవి అయితే రూ.1,800 వరకు అమ్ముతున్నారు. శనగ పప్పు ధర గతంలో కిలోకు రూ. 68 ఉండేది. ప్రస్తుతం రూ.110 కి చేరింది. కంది పప్పు కిలోకు రూ.174 పలుకుతోంది. పెసరపప్పు రూ. 124 నుంచి రూ.130 దాకా అమ్ముతున్నారు. పప్పుల ధరలు పెరగడంతో పప్పుచారు కూడా తినలేని పరిస్థితి ఏర్పడింది.

కొబ్బరి ధర పైపైకి..

కొబ్బరి కుడుకల ధరలు భారీగా పెరిగాయి. కొన్నాళ్ల క్రితం వరకు కిలోకు రూ.140 ఉన్న ధర ఇప్పుడు రూ.250 కి చేరింది. గతంలో ఇంత ధర ఎన్నడూ లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. వంటలో కొబ్బరి పొడి వేస్తేనే టేస్ట్ వస్తుంది. ముఖ్యంగా మాంసాహార వంటకాల్లో కొబ్బరి లేకుంటే శుచీపచీ లేకుండాపోతుంది. పెరిగిన ధర సామాన్యుడికి భారంగా మారింది. పచ్చికొబ్బరి కాయ ధర కూడా రూ. 30 దాటడం గమనార్హం.

ఉల్లి, వెల్లుల్లి ధరలు కూడా అడ్డగోలుగా పెరిగాయి. మార్కెట్‌లో ఉల్లిగడ్డ కిలోకు రూ.50 నుంచి రూ.70 దాకా అమ్ముతున్నారు. వెల్లుల్లి పావుకిలో సాధారణ రకం రూ.120 అమ్ముతుండగా, నాణ్యమైనవి రూ.150 కి అమ్ముతున్నారు. అంటే కిలో వెల్లుల్లి ధర రూ.480 నుంచి రూ.600 వరకు పలుకుతోంది. గతంలో ఎన్నడూ లేనంతగా వెల్లుల్లి ధర పెరిగింది. దీంతో చాలా కుటుంబాలు వెల్లుల్లి కొనడానికి వెనుకడుగు వేస్తున్నాయి.

మాంసం, కూరగాయల ధరలు..

మాంసం ధరలూ కొండెక్కాయి. జిల్లాలో కిలో మాంసం రూ.750 నుంచి రూ.780 వరకు అమ్ముతున్నారు. చికెన్ ధర రూ.2 వందలపైనే నడుస్తోంది. కోడిగుడ్డు కూడా ఒక్కొంటికి రూ.6 కు అమ్ముతున్నారు. మార్కెట్‌లో కూరగాయల ధరలూ మండుతున్నాయి. టమాట కిలో రూ. 60 నుంచి రూ.70 వరకు అమ్ముతున్నారు. చిక్కుడు, బీర, బెండకాయలు కిలోకు రూ.60 నుంచి రూ.80 వరకు విక్రయిస్తున్నారు. మిర్చి పావుకిలో రూ.20 అర కిలో తీసుకుంటే రూ.30 నడుస్తోంది. కొత్తిమీర 50 గ్రాములు రూ.20 పలుకుతోంది. అన్ని కూరగాయల ధరలూ ఇదే తీరున పెరిగాయి.

నూనెలు సలసల

ప్రభుత్వం ఇటీవల నూనెల దిగుమతుల మీద పన్నులు పెంచడంతో ధరలు అమాంతం పెరిగాయి. లీటర్‌కు రూ.20 నుంచి రూ.25 వరకు పెరిగాయి. ఒక కుటుంబం సగటున నెలకు నాలుగు లీటర్ల నుంచి ఐదు లీటర్ల వరకు వంటనూనె వాడుతోంది. ఈ లెక్కన ఒక్కో కుటుంబంపై నెలకు కనీసం రూ.వంద పైనే భారం పడుతోంది.

ధరలు తగ్గించాలి



నిత్యావసరాల ధరలు బాగా పెరిగాయి. నెల రోజుల క్రితం వంద రూపాయలు ఉన్న నూనె ప్యాకెట్ 150 రూపాయలకు చేరింది. ఇతర వస్తువుల ధరలూ పెరగడంతో ఇబ్బందిగా ఉంది. ధరలు తగ్గేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ఇస్తరాకుల మంజుల, మత్తమాల

బాగా పెరిగాయి



కూరగాయల ధరల మాట వింటేనే భయమేస్తోంది. ఉల్లిగడ్డలు, ఎల్లిగడ్డలు, టమాటలతో పాటు ఇతర కూరగాయల ధరలు బాగా పెరగడంతో కొనేందుకు కష్టంగా ఉంది. ప్రభుత్వం స్పందించి, ధరలను అదుపు చేయాలి.

– ల్యాగల భద్రవ్వ, మత్తమాల

పాఠశాలల్లో యువ టూరిజం క్లబ్‌లు

- చరిత్ర, సంస్కృతిపై అవగాహన కల్పించేందుకు..
- 25 మందితో ఏర్పాటు
- పర్యాటకంపై మరింత అవగాహన కల్పించడమే లక్ష్యంగా ముందుకు..



సదాశివనగర్ : పర్యాటకాన్ని మరింత అభివృద్ధి పర్చేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసింది. ప్రధానంగా పాఠశాల విద్యార్థులకు తమ ప్రాంతాల్లోని చారిత్రక కట్టడాలు, నిర్మాణాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో 'యువ టూరిజం క్లబ్'లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్లబ్‌లు ఉపాధ్యాయుల భాగస్వామ్యంతో నిర్వహించనున్నారు. ప్రధానంగా ఈ క్లబ్‌లు పర్యాటక రంగానికి సంబంధించిన వివిధ అంశాలపై దృష్టిని కేంద్రీకరించనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ఏడు నుంచి 12వ తరగతి చదువుతున్న 25 మంది విద్యార్థులతో క్లబ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లబ్‌కు ఒక విద్యార్థి నాయకుడిగా, ఒక ఉపాధ్యాయుడు సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. అన్ని పాఠశాలలు ఆన్‌లైన్ ద్వారా https://ytc.tourism.gov.in/club.registration వెబ్‌సైట్‌లో తమ పాఠశాలల యువ టూరిజం క్లబ్ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకొని సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుంది.

క్లబ్ లక్ష్యాలివే..

విభిన్న సంస్కృతులు, భౌగోళిక పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, పర్యావరణం, పర్యాటకం, ప్రకృతితో స్నేహం, ప్రయాణ మనస్తత్వాన్ని నేటి యువతలో పెంపొదిస్తాయి. రాబోయే తరానికి పర్యాటక ప్రాముఖ్యతను వివరిస్తూ దేశంలోని అనేక కళలు, సాంస్కృతిక రూపాల ప్రశంసలకు దోహదపడే విభిన్న కార్యకలాపాలను చేపడుతాయి. అలాగే పర్యాటకం తెలంగాణ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాయి. విద్యార్థులతో తమ ప్రాంత పర్యాటకాన్ని ప్రచారం చేయడాన్ని కూడా ఈ క్లబ్‌లు బాధ్యతగా చేసుకుంటాయి.

చరిత్ర, సంస్కృతిపై పట్టు వస్తుంది



విద్యార్థులకు చరిత్ర, సంస్కృతిపై పట్టు రావడానికి ఈ క్లబ్‌లు ఎంతో ఉపకరిస్తాయి. యువ టూరిజం క్లబ్‌లు పాఠశాలల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ముఖ్యంగా బాలురు, బాలికల ప్రాతినిధ్యం సమానంగా ఉండాలి. ఒక ఉపాధ్యాయుడు ఇన్‌చార్జిగా, హెచ్‌ఎంలు బాధ్యతగా క్లబ్‌లను ఏర్పాటు చేస్తారు. – రాజు, డీఈవో, కామారెడ్డి

మంచి నిర్ణయం



విద్యార్థుల్లో పర్యాటక రంగంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బాగుంది. ఈ క్లబ్‌ల నిర్వహణను పాఠశాలల్లో సమర్థవంగా నిర్వహించేందుకు కృషి చేస్తాం. ఈ క్లబ్‌ల ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు.

– యోసెఫ్, ఎంఈవో, సదాశివనగర్

సృజనాత్మకత పెంపొందుతుంది



ప్రభుత్వం పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్న క్లబ్‌ల కారణంగా విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుంది. స్థానిక కట్టడాలు, పర్యాటక ప్రదేశాలపై అవగాహన కలుగుతుంది. వాటి చరిత్రను తెలుసుకోవడానికి ఆసక్తిని కనబరుస్తారు. ఈ క్లబ్‌లు తోటి విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తాయి.

– లింగం, ఉపాధ్యాయుడు, భూంపల్లి

యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పతకాలు పొందిన జిల్లా క్రీడాకారులు

కామారెడ్డి అర్బన్: తెలంగాణ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పటాన్‌చెరులోని ముదిరాజ్ భవన్‌లో ఈనెల 3 నుంచి 5 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. బాలుర విభాగంలో రెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి జి.సందీప్, తొమ్మిదో తరగతి విద్యార్థి జి.నవదీప్ బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.రాంరెడ్డి తెలిపారు. బాలికల విభాగంలో మాచారెడ్డి కేజీబీవీ విద్యార్థి సీహెచ్.సహస్ర రెండో స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికైందన్నారు.

సబ్ జూనియర్ విభాగంలో సునీత, కవిత, నిఖిత, సరస్వతి, సింధూజ, జ్యోత్స్న పతకాలు సాధించారన్నారు. జూనియర్ విభాగంలో ఐశ్వర్య, అనిత, నిహారిక, కల్యాణి పతకాలు పొందారని తెలిపారు.

ముగిసిన బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ

- బాలికల విభాగంలో విజేతగా ఖమ్మం
- బాలుర విభాగంలో విజేతగా రంగారెడ్డి జట్టు





రంగారెడ్డి బాలుర జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు, ఖమ్మం బాలికల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రాబెల్స్ హైస్కూల్ మైదానంలో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో రంగారెడ్డి జిల్లా, ద్వితీయ స్థానంలో ఆదిలాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో హైదరాబాద్, తృతీయ స్థానంలో వరంగల్ జట్లు నిలిచాయి.

విజేతలకు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పీవీ రమణ, జిల్లా అధ్యక్షుడు ఎల్.నర్సింగరావు, కోశాధికారి చిన్నయ్య, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణమూర్తి, రైల్వే కోచ్ శశి కప్‌లు అందించారు.



దేశాయిపేట్‌లో ప్రతిష్ఠించిన అష్టాదశ శక్తిపీఠాల అమ్మవార్లు

ఒకేచోట అష్టాదశ శక్తి పీఠాలు

- అమ్మవారి మండపంలో 18 శక్తి స్వరూపాలు
- దేశాయిపేట్ గ్రామంలో ఏర్పాటు
- దర్శించుకుని తరిస్తున్న భక్తులు

బాన్సువాడ రూరల్: దైవ అనుగ్రహం పూర్తిస్థాయిలో ఉన్న భక్తులు మాత్రమే ప్రపంచవ్యాప్తంగా అష్టాదశ శక్తిపీఠాలను దర్శించి తమ మానవజన్మను సార్థకం చేసుకుంటారని పురాణ, ఇతిహాసాలు చెబుతున్నాయి. అయితే అనేక వ్యయప్రయాసాలకు ఓర్చి అష్టాదశ శక్తిపీఠాలన్నింటిని దర్శించుకునే భాగ్యం భక్తులందరికీ కలగదు! అలాంటి భక్తులకు బాన్సువాడ మండలం దేశాయిపేట్ గ్రామస్తులు దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చక్కటి అవకాశం కల్పించారు. పురాణాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 108 శక్తిపీఠాలు ఉన్నాయని కొందరు, భారతదేశంలోనే 54 శక్తిపీఠాలు ఉన్నాయని కొందరు చెబుతుంటారు. అయితే ఆది శంకరాచార్యులవారు దర్శించుకుని శ్రీచక్రస్థాపన చేసిన 18 శక్తిపీఠాల్లో కొలువై ఉండే అమ్మవారి ప్రతిరూపాలను స్థానిక హనుమాన్ మందిరంలోని దేవీ మండపంలో అమ్మవారితో పాటు ప్రతిష్టించారు. గ్రామస్తులతోపాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు దేశాయిపేట్‌లోని శ్రీదేవి మండపాన్ని దర్శించుకుని శక్తిపీఠాలను దర్శించుకున్న అనుభూతిని పొందుతున్నారు. 25వ వార్షికోత్సవం ప్రత్యేకంగా నిర్వహించాలని భావించి అష్టాదశ శక్తిపీఠాలను ప్రతిష్ఠించాలని సంకల్పించారు.

దాతల సహకారంతో..

అమ్మవారి ప్రధాన విగ్రహం, శ్రీలంకలో ఉన్న శాంకరి దేవి ప్రతిరూపంతోపాటు 17 శక్తిపీఠాల్లో కొలువైన అమ్మవారి విగ్రహాల ప్రతిరూపాలను ఇచ్చేందుకు దాతలు ముందుకు వచ్చారు. ఈనెల 3 నుంచి 13వ తేదీ వరకు ప్రతిరోజూ అన్నదానం చేసేందుకు భక్తులు పేర్లు నమోదు చేసుకున్నారు. ఉత్సవ విగ్రహంతోపాటు శక్తిపీఠాలపై కొలువై అమ్మవార్లకు పుస్తమట్టెల సమర్పణకు సైతం భక్తులు పోటీపడి ముందుకు రావడంతో గ్రామానికి చెందిన రామస్వామి ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవ కమిటీ నవరాత్రులను అంగరంగ వైభవంగా నిర్వహిస్తోంది.

ప్రత్యేక కార్యక్రమాలు..

నవదుర్గా దేవి మండపంలో కలశస్థాపన, నిత్య అగ్నిహోత్రం, నిత్యన్నదానం, లలిత సహస్ర పారాయణం, పుణ్యహవాచన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. వీటితోపాటు కీర్తనలు, హరికథ, ప్రవచనాలు, భక్తిపాటల(ఆర్కెస్ట్రా) కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 11న శుక్రవారం సామూహిక కుంకుమార్చన, 13న హోమం, పూర్ణాహుతి, అష్టదశ అమ్మవార్ల శోభాయాత్ర నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

సంప్రదాయానికి పెద్దపీట



నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈసారి అష్టాదశ శక్తిపీఠాలను ఏర్పాటుచేశాం. సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం. సినిమా పాటలు, రికార్డింగ్ డ్యాన్సులు నిషేధం., అమ్మాయిలు జీన్స్, అబ్బాయిలు షార్ట్‌లు వేసుకుని రావొద్దని నియమం పెట్టాం. ప్రతిరోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.

– రామస్వామి, పూజారి, దేశాయిపేట్

దాతలందరికీ కృతజ్ఞతలు



ఉత్సవాల్లో భాగంగా అష్టాదశ శక్తిపీఠాల ఏర్పాటు, పూజా కార్యక్రమాలు చాలా ఖర్చుతో కూడుకున్నవి. గ్రామస్తుల సహకారం, దాతల ప్రోత్సాహంతో నవరాత్రి ఉత్సవాలను ఈసారి చాలా ప్రత్యేకంగా నిర్వహిస్తున్నాం. గ్రామానికి చక్కటి పేరు వస్తోంది. ప్రతిరోజూ మధ్యాహ్నం క్వింటాల్ నుంచి 150 కిలోల బియ్యంతో అన్నదాన కార్యక్రమం కొనసాగుతోంది.

– తుల శ్రీనివాస్, దేశాయిపేట్

శక్తి పీఠాలు ఒకేచోట..



మండలంలో కొలువైన అమ్మవారి ప్రధాన విగ్రహంతోపాటు అష్టాదశ శక్తి పీఠాల అమ్మవార్లను దర్శించుకోవడానికి ప్రతిరోజూ భవానీ దీక్షాధారులు, భక్తులు తరలి వస్తున్నారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఉంటున్నాయి. దేశంలో ఎక్కడెక్కడో ఉన్న శక్తి పీఠాలను ఒకే దగ్గర చూసి తరలించాలని కోరుతున్నాం.

– గంట చంద్రశేఖర్, భక్తుడు, దేశాయిపేట్

కొలువైన అమ్మవార్లు

శాంకరి, కామక్షి, శృంఖల, చాముండి, జోగులాంబ, భ్రమరాంబిక, మహాలక్ష్మి, ఏకవీరిక, మహాకాళి, పురుహూతిక, గిరిజ, మాణిక్యాంబ, కామరూప, మాధవేశ్వరి, వైష్ణవి, మంగళగౌరి, విశాలక్షి, సరస్వతి.

క్లుప్తంగా

పసికందు విక్రయం

- ఐదుగురిపై కేసు నమోదు



ఆర్మూర్‌టౌన్: ఏడు నెలల బాలుడిని విక్రయించిన ఘటనలో ఐదుగురిపై కేసు నమోదైంది. వివరాలు.. నందిపేట మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన అంగేటి లక్ష్మి, పోశెట్టి దంపతులు ఏడాది నుంచి ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో నివాసం ఉంటున్నారు. భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఏడు నెలల బాబు ఉన్నాడు. తాగుడికి బానిసైన పోశెట్టి గత శుక్రవారం మద్యం మత్తులో తన శిశువును పెర్కిట్‌కు చెందిన మధ్యవర్తి మహమ్మద్ గౌస్ ద్వారా పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన హబీబ్‌ఖాన్‌కు రూ.30 వేలకు విక్రయించాడు. హబీబ్‌ఖాన్ నిర్మల్‌లో ఉంటున్న సంతానం లేని తన కూతురు రషీద భర్త మహమ్మద్‌కు శిశువును ఇచ్చాడు. వారం రోజుల తరువాత తాగిన మైకంలో పోశెట్టి 100 డయల్‌కు ఫోన్‌చేసి తనబాబును తనకు ఇప్పించాలని ఫిర్యాదు చేశాడు. నందిపేట్, ఆర్మూర్ పోలీసులు పెర్కిట్‌కు చేరుకొని పోశెట్టిని విచారించగా విక్రయ ఉదంతం మొత్తం వెలుగులోకి వచ్చింది. పసికందు విక్రయ వ్యవహారంలో బాధ్యులైన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం శిశువును ఐసీడీఎస్ అధికారులకు పోలీసులు అప్పగించారు.

'కుల బహిష్కరణ చేస్తామని బెదిరిస్తున్నారు'



వర్ని: మోస్రా మండల కేంద్రంలో గౌడ కులానికి చెందిన కొందరు పెద్దలు తమని కులబహిష్కరణ చేస్తామని బెదిరిస్తున్నారని ఆదివారం బోధన్ ఎక్సైజ్ శాఖాధికారులకు 12 కుటుంబాలకు చెందిన యువకులు ఫిర్యాదు చేశారు. గ్రామంలో గౌడ కులస్తులు కొందరు వారి ఇష్టానుసారంగా కల్లు మామ్లా నడుపుతున్నారని వారి అక్రమాలు ఆగడాలను ప్రశ్నించినందుకు అన్ని కార్యక్రమాలకు దూరంగా పెడుతున్నారని పేర్కొన్నారు. సదరు గౌడ సంఘం సభ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.20 వేలతో డ్రోన్ తయారు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలం గున్కుల్ గ్రామానికి చెందిన ముశ్నబోయిన భాను ప్రకాశ్ గౌడ్ రూ.20 వేలతో డ్రోన్ తయారు చేసి ఆశ్చర్యపరిచాడు. ఆ డ్రోన్ ఆదివారం గాలిలోకి ఎగరడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. భానుప్రకాశ్ మెకానికల్ డిప్లమా పూర్తి చేసి ప్రస్తుతం అప్లికేషన్ సెక్యూరిటీ ఇంజినీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అయితే డిప్లమా చదువుతున్న 2018లోనే కళాశాలలో మందుల పిచికారీకి డ్రోన్ తయారు చేశాడు. నేర్చుకున్న విద్యను మర్చిపోవద్దని భావించిన భానుప్రకాశ్‌గౌడ్ దసరా సెలవుల్లో గున్కుల్ గ్రామానికి వచ్చాడు. ఆన్‌లైన్‌లో రూ.20 వేలకు డ్రోన్ పరికరాలను కొనుగోలు చేశాడు. డ్రోన్‌ను తయారు చేసి ఆకాశంలోకి పంపడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఇద్దరు మహిళలపై దాడి

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని కూరగాయల సంతలో ఆదివారం రాత్రి ఇద్దరు మహిళలపై ఇద్దరు యువకులు దాడి చేసి గాయపరిచారు. సంతలో దుకాణం ఏర్పాటు చేసుకొని మహిళలు కూరగాయలు విక్రయిస్తుండగా ఇద్దరు యువకులు ఆటోను తీసుకొచ్చి వారి దుకాణాల ఎదుట పెట్టడంతో మహిళలు ఆటోను పక్కకు తీయాలని చెప్పారు. వారి మాట వినకుండా ఆటోను అక్కడే ఉంచడంతో మహిళలు గట్టిగా అరిచి చెప్పారు. ఆగ్రహించిన యువకులు ఇద్దరు మహిళలపై దాడి చేశారు. ఒక మహిళకు తలపై, మరో మహిళకు ముక్కుపై తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని ఆస్పత్రికి, యువకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఆశాజనకంగా సోయా దిగుబడులు



కల్దుర్కిలో సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి(ఫైల్)

- ప్రభుత్వ మద్దతు ధర రూ.4,892
- బయటి మార్కెట్లో పడిపోయిన ధర
- సేకరణ పరిమితిపై రైతుల్లో ఆందోళన

బోధన్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్, వాతావరణ పరిస్థితులు సోయా రైతులకు కలిసివచ్చింది. ఆశాజనకంగా దిగుబడులు చేతికొస్తుండటంతో రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. నాలుగేళ్లుగా ప్రకృతి ప్రకోపం కారణంగా పంట దెబ్బతిని దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపడంతో రైతులు నష్టాల బారిన పడ్డారు. జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో సోయా పంట కోతలు వారం రోజు క్రితం నుంచి ప్రారంభం కాగా, దిగుబడులు రైతుల ముంగిట్లోకి చేరుతున్నాయి. ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. గత ఏడాది ఎకరానికి గరిష్టంగా 6 నుంచి 7 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు చేతికి రాక నష్టాలకు గురయ్యారు.

జిల్లాలో 37 వేల ఎకరాల్లో సాగు

నిజామాబాద్ జిల్లాలో 37 వేల ఎకరాల విస్తీరణంలో సోయా పంట సాగైనట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మంజీర, గోదావరి నదుల తీరంలో సారవంతమైన నల్లరేగడి భూములున్నా బోధన్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని బోధన్, సాలూర, రెంజల్, కోటగిరి, పోతంగల్ మండలాల్లో జిల్లాల్లోనే అత్యధిక విస్తీర్ణంలో సోయా పంటను రైతులు సాగు చేశారు. బోధన్ మండలంలో 7,372 ఎకరాల్లో, సాలూరలో 5,355, రెంజల్‌లో 5,333 ఎకరాల్లో సోయా సాగైంది. పంట కోత కొన్ని చోట్ల 50 శాతం వరకు పూర్తయ్యాయి. ప్రభుత్వం సోయా క్వింటాలుకు రూ.4,892 ధర ప్రకటించింది. మార్కెట్లో వారం రోజుల క్రితం క్వింటాలుకు రూ.4600 ఉండగా, ప్రస్తుతం రూ.4400లకు పడిపోయింది.

ఎమ్మెల్యే చొరవతో కొనుగోలు కేంద్రాలు

సోయా దిగుబడులు రైతులకు చేతికి రావడం, మార్కెట్లో వ్యాపారులు ధరను తగ్గించడం, వాతావరణ పరిస్థితిని గుర్తించిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి స్వయంగా సాలూర మండలంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 3న మార్క్‌ఫెడ్, నాఫెడ్ సహకారంతో కల్దుర్కిలో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, సాలూర, హున్సా సొసైటీల్లో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మొదట వేల్పూర్ సొసైటీలో కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది.

కొనుగోలు ప్రక్రియ ప్రారంభం ఎప్పుడో?

కేంద్ర ప్రభుత్వ అధీనంలో ఉన్న నాఫెడ్ అనుమతి మేరకు రాష్ట్ర మార్క్‌ఫెడ్ సంస్థ ప్రతి ఏటా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతుల నుంచి మద్దతు ధరకు సోయాను కొనుగోలు చేస్తోంది. జిల్లాలో నాలుగు రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినప్పటికి రైతుల నుంచి పంట సేకరణ ప్రక్రియ జరగటం లేదు. రైతులు ఖాళీ ప్రదేశాలు, సొసైటీ కొనుగోలు కేంద్రాల్లో సోయాను ఆరబెడుతున్నారు. రైతులను వర్షం భయం వెంటాడుతోంది.



సాలూరలో సోయా ఆరబెడుతున్న రైతులు

పరిమితి ఆంక్షల గుబులు

కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ఎకరానికి 6 క్వింటాళ్ల చొప్పున సేకరించాలని మార్క్‌ఫెడ్ పరిమితి విధించింది. ఎకరానికి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిన పరిస్థితిలో రైతులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉంది. పరిమితి ఆంక్షలు రైతులను ఆందోళనకు గురి చేస్తోంది. ఎన్ని క్వింటాళ్ల కొంటారో మార్క్‌ఫెడ్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. అలాగే సొసైటీలకు సోయా సేకరణకు సంబంధించిన అలాట్‌మెంట్ ఉత్తర్వులు వెంటనే ఇవ్వాల్సిన అవసరం ఉంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన సహకార సంఘాల పాలకవర్గ సభ్యులపై రైతుల నుంచి కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని ఒత్తిడి పెరుగుతోంది.

10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది



ఆరు ఎకరాల్లో సోయా సాగు చేశాను. పంట కోత పూర్తయింది. ఎకరానికి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. మార్కెట్లో ధర లేదు. సొసైటీ కొనుగోలు కేంద్రంలో పంటను పూర్తిగా కొనుగోలు చేయాలి. గతంలో ఎకరానికి 6 క్వింటాళ్ల మేరకు కొనుగోలు చేశారు.ఈ సారి దిగుబడి పెరిగినందున పంటను పూర్తిగా కొనాలి. లేకపోతే మళ్లీ దళారులకు అమ్ముకొని నష్టపోవాల్సి వస్తుంది. – ముట్టిన్ దత్తు, సోయా రైతు, సాలూర

డీజేలకు అనుమతివ్వండి

ఖలీల్‌వాడి: దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా డీజేల అనుమతి, హోటళ్ల సమయం విషయంలో సీపీ కల్మేశ్వర్ సానుకూలంగా స్పందించినట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి తెలిపారు. ఆదివారం సీపీ కార్యాలయంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డితోపాటు జిల్లా డీజే అసోసియేషన్ సభ్యులు, హోటల్ యజమానులు సీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ.. తక్కువ సౌండ్‌తో పండుగలకు డీజేకు అనుమతి ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కార్పొరేటర్ ఖుద్దూస్, నిజామాబాద్ జిల్లా డీజే అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి : సీపీ

ఖలీల్‌వాడి: డీజే నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 వరకు లైసెన్సులు, పర్మిషన్లు తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రాలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చే డీజేలను పూర్తిగా నిషేధించినట్లు వివరించారు. పోలీస్ శాఖ ఇచ్చిన ఆదేశాలు పాటిస్తూ ప్రజలకు, సీనియర్ సిటిజన్లకు, పిల్లలకు ఇబ్బందులు కలుగకుండా చట్ట పరిధిలో రెండు సౌండ్ బాక్స్ సిస్టమ్‌లు వాడుతూ ఈ కార్యక్రమాలను జరుపుకోవాలని తెలియజేశారు.



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న మానాల, డీజే అసోసియేషన్ సభ్యులు

డ్రెయినేజీ నిర్మించండి మహాప్రభో..



ఇళ్లలోకి వచ్చిన మురికినీరు (ఫైల్)



డ్రెయినేజీ లేక రోడ్డుపక్కనే పారుతున్న మురుగు

- గజ్యానాయక్ తండా చౌరస్తాలో ఇళ్లలోకి చేరుతున్న వరద నీరు
- ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేక అవస్థలు
- రోడ్డు నిర్మించి డ్రెయినేజీ వదిలేసిన వైనం..

మాచారెడ్డి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట నుంచి గజ్యా నాయక్ తండా చౌరస్తా మీదుగా ఘన్‌పూర్ స్టేజీ వరకు గత ప్రభుత్వ హయాంలో రూ. 1.26కోట్ల వ్యయంతో 4 వరుసల రోడ్డుతో డివైడర్లు నిర్మించారు. అన్ని హంగులతో రోడ్డు నిర్మించారు కానీ డ్రెయినేజీ నిర్మించడం మరచిపోయారు. రోడ్డు నిర్మించే సమయంలో స్థానికులు రోడ్డు కంటే ముందు డ్రెయినేజీ నిర్మించాలని నెత్తీనోరు మొత్తుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. స్థానికులు ఎన్నో ఏళ్లుగా డ్రెయినేజీలు లేక ఇబ్బందులు పడ్డారు. నాలుగు వరుసల రోడ్డు నిర్మిస్తున్నప్పుడైనా డ్రెయినేజీ నిర్మిస్తారని స్థానికులు సంబుర పడ్డారు. రోడ్డు నిర్మాణం పూర్తయినా డ్రెయినేజీ ఊసెత్తక పోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అలాగే రోడ్డు నిర్మాణంతో ఇళ్లు రోడ్డు కిందికి పోయి ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్షాకాలంలో అవస్థలెన్నో..

డ్రెయినేజీ లేక ఓ మోస్తరు వర్షానికే నీళ్లు ఇళ్లల్లోకి వచ్చి చేరుతున్నాయి. ఈ వర్షాకాలంలో రెండు, మూడు సార్లు ఇళ్లల్లోకి నీళ్ళు చేరి ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీళ్లు ఇళ్లల్లోకి రాకుండా అధికారులు తూతూ మంత్రంగా కాలువ తవ్వించారు. వర్షం నీటితో ఆ కాలువ నిండి పలువురు ఆ కాలువలో పడి గాయాలపాలయ్యారు. అన్ని పార్టీల నాయకులు ఎన్నికల ముందు డ్రెయినేజీ నిర్మిస్తామని హామీ ఇచ్చినా లాభం లేకుండా పోయింది. ఇప్పటి కైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రెయినేజీ నిర్మిస్తేనే ఓటేస్తాం..



లక్షలు వెచ్చించి ఇల్లు కట్టుకొని వేలకు వేలు టాక్సీలు కడుతున్నా డ్రెయినేజీ నిర్మించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. డ్రెయినేజీ నిర్మించకుంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటేయం.అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మించాలి. – గోనె శ్రీహరి, స్థానికుడు

రోగాల పాలవుతున్నాం



డ్రెయినేజీలు లేక మురికి నీరు రోడ్డుపై ప్రవహించి దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దాంతో అనేక రోగాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి డ్రెయినేజీ నిర్మించాలి. లేకుండా ఆందోళనలు చేస్తాం. – లావుడ్యా సంతోష్, స్థానికుడు

గడప గడపకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు

నిజాంసాగర్(జుక్కల్) : కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గడపగడపకు చేరుతున్నాయని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రానున్న పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తాయన్నారు. ఆదివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలోని సొసైటీ గెస్ట్‌హౌస్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సుప్రయాణం, పంట రుణాల మాఫీతో ప్రతీ ఒక్క కుటుంబానికి లబ్ది చేకూరుతుందన్నారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్యగారి. ఆకాష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌యాదవ్, నాగభూషణం గౌడ్, గొట్టం నర్సింలు, సవాయిసింగ్, లోక్యానాయక్, తాటిపల్లి సరస్వతి, కొరమండల్ సాయాగౌడ్, తోట రాజు సాయాగౌడ్ తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

కమిటీలతో కాలయాపన



మాచారెడ్డి : ఎస్సీ వర్గీకరణ అధికారం రాష్ట్ర ప్రభుత్వాలే చూసుకోవాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసినా సీఎం రేవంత్ రెడ్డి కమిటీలతో కాలయాపన చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు బట్ట రమేశ్, రాష్ట్ర నాయకుడు వెంకట్రాములు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మాచారెడ్డిలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేయకుండా డీఎస్సీ ఫలితాలను విడుదల చేయడం విడ్డూరమన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడం కోసం ఈ నెల 9న కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమానికి మాదిగలు తరలిరావాలన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గడ్డం బాబు, పొదర్ల దేవరాజు, ప్రేమ్ కుమార్ ఉన్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో సర్వేయర్ మృతి



సర్వేయర్ మోహన్ (ఫైల్)

ఇందల్వాయి: ఇందల్వాయి మండల రెవెన్యూ సర్వేయర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కంకెణీ మోహన్(54) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఏడాది కాలంగా ఆయన ఇందల్వాయిలో పని చేస్తున్నారు. గుండెపోటు రావడంతో ఆయనను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా అక్కడే మృతి చెందారు. ఆయనకి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల తహసీల్ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలియజేశారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్..

వేల్పూర్: జాన్కంపేట్ మాజీ సర్పంచ్ కొలిప్యాక గంగారాం(79) అనారోగ్యంతో శనివారం రాత్రి మరణించగా ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన 1985 నుంచి 1987 వరకు పచ్చలనడ్కుడ సొసైటీ తొలి చైర్మన్‌గా, 1988 నుంచి 1993 వరకు జాన్కంపేట్ సర్పంచ్‌గా, 1995 నుంచి 1999 వరకు ఎంపీటీసీగా పని చేశారు. పలువురు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఆయనకు నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



కొలిప్యాక గంగారాం(ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడినట్లు భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ జిల్లా గుడిహత్నూర్ గ్రామానికి ఖాళీ పండ్ల బాక్స్‌లు తీసుకుని వస్తున్న డీసీఎం వ్యాన్ భిక్కనూరు మండల కేంద్రం సమీపంలోజాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ షేక్ అబీద్(36), క్లీనర్ సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించగా షేక్ అబీద్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



ప్రమాదానికి కారణమైన వ్యాన్

కొండచిలువ హతం



నందిపేట్ (ఆర్మూర్): షాపూర్‌లో చేపల వలకు చిక్కుకున్న కొండచిలువను జాలర్లు హతమార్చారు. గ్రామంలోని జంగం కుంట చెరువులో చేపలు పట్టేందుకు జాలర్లు శనివారం సాయంత్రం కండ్రిలను ఏర్పాటు చేశారు. ఆదివారం చేపల కోసం కండ్రిలను లాగగా వలలో సుమారు 30 కిలోల బరువు, 8 ఫీట్ల పొడవు గల కొండచిలువ చిక్కింది. దీంతో జాలర్లు చెరువు నుంచి బయటకు లాగి కొండ చిలువను చంపివేశారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య

ధర్పల్లి: జీవితంపై విరక్తితో హొన్నాజీపేటకి చెందిన బండి నర్సవ్వ(40) అనే మహిళ అదే గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. వివరాలు.. నర్సవ్వకు కొన్ని రోజులుగా చెవులు కూడా వినిపించడం లేదు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి నర్సవ్వ బయటకు వెళ్లింది. రాత్రి వరకు బంధువులు గాలించినా ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం స్థానిక చెరువులో ఆమె మృతదేహం కనిపించింది. నర్సవ్వ ఇటీవల మానసికంగా కృంగిపోయిందని, మతిస్థిమితం కూడా కోల్పోయిందని బంధువులు చెబుతున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అప్పుల బాధతో ..

వర్ని: మోస్రా గ్రామానికి చెందిన సంఘం సాయిలు(46) అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు వర్ని ఎస్సై కృష్ణ కుమార్ తెలిపారు. వివరాలు.. సాయిలు ఈనెల 5న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. గ్రామ ఊర చెరువులో ఆదివారం ఉదయం స్థానికులు సాయిలు శవాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు. అప్పుల బాధతోనే చెరువులో దూకి సాయిలు ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబసభ్యులు చెబుతున్నారు.



సాయిలు మృతదేహం

కాలువలో జారిపడి ఒకరి గల్లంతు

ఖలీల్‌వాడి: ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి ఒకరు గల్లంతైనట్లు నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై మొగులయ్య తెలిపారు. వివరాలు.. ఆదివారం నగరంలోని ధర్మపురి హిల్స్‌కు చెందిన అక్బర్ ఖాన్(38) సారంగాపూర్ డైరీ ఫారం వద్ద ఉన్న కాలువ గట్టుపై కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. సమాచారం తెలిసి స్థానిక కాలనీవాసులు, కార్పొరేటర్లు అక్కడికి చేరుకుని అక్బర్ కోసం గాలించారు. స్థానికుల సమాచారం మేరకు ఆరో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తూ నీటమునిగి వ్యక్తి మృతి



డొంకేశ్వర్(ఆర్మూర్): ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తూ నీటమునిగి మృతి చెందాడు. ఎస్సై హరిబాబు తెలిపిన వివరాలు.. డొంకేశ్వర్ మండలం నూత్‌పల్లి గ్రామానికి చెందిన తోకల గంగాధర్ (50) సమీపంలోని ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌లో ఆదివారం ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో పడి మరణించాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సిరికొండ: మండలంలోని ఒంటిప్ప తండా వద్ద వాగులో నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై ఎల్.రామ్ ఆదివారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నందున ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై చెప్పారు.



పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్

అత్తతో కలిసి మామను చంపిన అల్లుడు



గొర్రెల కొట్టాన్ని పరిశీలిస్తున్న సీఐ వెంకటనారాయణ

- ఆస్తి కోసం ఘాతుకం
- సాధారణ మృతిగా చిత్రీకరించేందుకు యత్నం
- పోలీసుల రాకతో బయటపడిన నిజం

బోధన్‌టౌన్(బోధన్): మామ ఆస్తిపై కన్నేసిన అల్లుడు అత్తతో కలిసి మామను హత్య చేసిన ఘటన బోధన్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. పట్టణంలోని ఉద్మీర్‌గల్లీకి చెందిన క్యామొల్ల శంకర్(45) శనివారం రాత్రి గొర్రెల కొట్టం బయట నిద్రిస్తుండగా అల్లుడు రవి, అత్త చిన్నమ్మతో కలిసి గొంతు నులిమి చంపి ఇంట్లోకి తీసుకొచ్చి సాధారణ మృతిగా చిత్రీకరించేందుకు యత్నించారు. స్థానికులు ఒంటిపై ఉన్న గాయాలను గమనించి అనుమానంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని, గొర్రెల కొట్టాన్ని పరిశీలించారు. గొంతు నులిమిన ఆనవాళ్లు, ఇతర గాయాలను గమనించి అల్లుడు, అత్తను అదుపులోకి తీసుకొని విచారించగా.. తామే హత్యకు పాల్పడినట్లు వారు అంగీకరించారని సీఐ వెంకట నారాయణ తెలిపారు. చెక్కీ క్యాంప్‌నకు చెందిన రవికి ఐదేళ్ల క్రితం శంకర్ పెద్దకూతురుతో వివాహం జరిగింది. అనంతరం రవిని వారు ఇల్లరికం తెచ్చుకున్నారు. ఇటీవల ఇంట్లో అత్తమామకు జరుగుతున్న చిన్నచిన్న గొడవలను అదునుగా తీసుకొని ఈ హత్యకు పూనుకున్నాడు. మద్యం సేవించి కొట్టంలో మంచంపై పడుకున్న శంకర్‌ను ఛాతీపై పిడిగుద్దులు గుద్దడంతో పాటు గొంతు నుమిలి హత్య చేసినట్లు వారు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, చిన్న కూతురు సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెంకట నారాయణ తెలిపారు.



శంకర్ (ఫైల్)

ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.లక్షా 50 వేల మోసం

నిజామాబాద్ రూరల్: మల్లారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.లక్షా 50 వేలు పోగొట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. శనివారం ఆన్‌లైన్ యాప్ ద్వారా పెట్టుబడి పెడితే దానికి రెట్టింపు నగదు ఇస్తామని ఆన్‌లైన్ యాప్ నిర్వాహకులు పేర్కొనడంతో ఆ వ్యక్తి లక్షా 50 వేలు పెట్టుబడి పెట్టాడు. దీంతో పెట్టిన నగదు కాస్త మాయమవడంతో లబోదిబోమంటూ ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. మోసం చేసిన వ్యక్తి ఖాతాను ఫ్రీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ పేర్కొన్నారు. ఆన్‌లైన్ లింకులు ఓపెన్ చేయవద్దని, ఓటీపీలు చెప్పొద్దని, ఆన్‌లైన్ మోసాలు జరిగితే 24 గంటల్లోపు పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురిపై కేసులు నమోదు



భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై భిక్కనూరు ఎస్సై సాయికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

జక్రాన్‌పల్లి: అర్గుల్ శివారులోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడు మహారాష్ట్రలోని భోకర్ తాలూకాలోని రేనాపూర్‌నకు పండిత్ గోరి (28)గా గుర్తించారు. బాల్కొండ మండలంలోని జలాల్‌పూర్ నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా దారి తప్పి అర్గుల్ వైపు రాగా శివారులోని కోల్డ్ స్టోరేజీ వద్ద డివైడర్ ఢీకొని కిందపడిపోయాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులున్నారు.